# దేవుడు చూడని కథ

శ్రీ శ్రీరంగం రాజేశ్వరరావు

మనూళ్లో ఆకాశం వుంది....మనూళ్లో పగలు సూర్యుడూ, రాత్రి చంద్రుడూ వుంటారు...మనూళ్లో కష్టాలున్నాయి...సుఖాలున్నాయి..... మనుషులున్నారు....మనూళ్లోనే చిరునవ్వులున్నాయి..... కన్నీళ్లున్నాయి.....పెడబొబ్బలున్నాయి... అట్టహాసాలున్నాయి...పెను ఏడుపులున్నాయి.....అలాగే—

కొన్నాళ్ల క్రితం ఓమోస్తరుగా వుండి, ఇప్పుడు విపరీతంగా (బియ్యం కంట్రోల్లా) నాగరికత పెరిగిపోయిన మనూరి మధ్య దేవేంద్ర భవనాల్లాటి మేడలతో్బాటు, మనం చూస్తే కడుపులోదేవినట్టుండే గుడిసెలు కూడా వున్నాయి. కాస్త ఓపిక పట్టి అలా గుడిసెల పక్కగా నడచివెళ్తే,నాలుగో వరసలో తొమ్మిదో గుడిసెనుంచి కాబోలు.....ఓ సన్నని రాగం, మధ్యమధ్య ఎక్కిళ్లతో వినిపిస్తుంది. ఆ ఏడుపు దూరంగా వున్న శ్మశానంలోంచి ఏదో ప్రేతాత్మ అరుస్తున్నట్టుంది. ఇప్పటిదాకా సృష్టిలో వున్న విచారాన్నంతటినీ తనలోనింపుకుని, కన్నీళ్లన్నీ ఖర్చయ్యేక, అప్రయత్నంగా గాల్లో కలిసిపోతున్న ఆయేడుపు అతిఘోరంగానూ, ఏ మూలన్నా, జాలి దాగుంటే అది ఒక్కసారిగా ఒలికి పోయేట్టు అతి దీనంగానూ వుంది.

ఇంకొంచెం ఓపికపట్టి అలాతొంగి చూస్తే, ఆ గుడిసంతా పూర్తిగా కనిపిస్తుంది. అందులో గోడలు నల్లగా మాసి పోయి, తెగమాసిపోయున్నాయి. పొగచూరిన ఆ నేలా, ఆ గోడలూ అన్నీ నల్లగా అతి అసహ్యంగానూ వున్నాయి. గోడల మీద నై జయంతిమాల, జవహర్‌లాల్ నెహ్రూగారూ కాగితాలమీద వేళ్ళాట్టం లేదు. ఒకచోటమాత్రం, చిన్న అరలో ఓ దేవుడి విగ్రహం ఎన్నో యుగాల నుంచీ వున్నట్లు అక్కడేవుంది. కాస్తంత మసిబారి, ఇంకొంచెం మాసిపోయి,— ఆ గుడిసెలో వున్నట్టే, వుండదగ్గట్టే వుంది. ఆ విగ్రహంలో కళ్లు మాత్రం, ఈ కష్టాలింక చూడలేవన్నట్టుకాస్త చిట్లించుకున్నట్టున్నాయి.

అక్కణ్ణించి కొంచెం కిందికి చూస్తే, పొగచూరిన గోడకి బాగా కిందుగా భూమ్మీద, నిరాశతో చేసినట్టున్న నులక మంచం వుంది. ఆ మంచం మీద ఓ మానవాకారం వుంది. పడుక్కుని కనిపిస్తుంది—— జాగ్రత్తగా చూస్తే ఆ ఆకారంలో దాదాపు యాభయ్యేళ్ల వయసూ, కష్టాల్లోనూ, దరిద్రంలోనూ మునిగిపోయి, ఇంక తేలడానికవకాశంలేక అలానే వుండి పోయిన మనసు నీడ మొహం మీద—స్పష్టంగా కనిపిస్తాయి. ఓ రెండుగాజు గుడ్లలావున్న కళ్ళుమాత్రం దీనంగా, అతి దీనంగా, ఘోరంగా, అతిఘోరంగా, దూరంగా అతి దూరంగా, చూస్తున్నట్టున్నాయి. కాని జాగ్రత్తగా చూస్తే, అవిమాత్రం మసిబారిన గోడమీద పూర్తిగా మసిబారని దేవుడి విగ్రహం పాదాలవైపు చూస్తున్నట్టు

తెలుస్తుంది. సన్నగావున్న ఎముకల్ని దరిద్రం తోనూ, అక్కడక్కడ వికృతంగా వంగిపోయిన మాంసపు ముద్దల్ని నిరాశతోనూ కలిపి చేసి నట్టున్న ఆశరీరాన్ని చూస్తే,—నరకంలో సగం శిక్షనుభవించి, పొరపాటున భూమికి జారిపోయిన 'గతప్రాణి'లా వుందేగాని, 'ప్రాణి'లా లేనేలేదు.

ఆ ఆకారంపక్కనే ఓ పద్దెందేళ్లమ్మాయి—ఇంకా కన్నీళ్లు పూర్తిగా ఇంకిపోక పోవడం వల్ల చాలా ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లి నట్టుంది. అందుకు గుర్తుగా ఆమె బుగ్గలమీద చారలు కట్టిన కన్నీటి గుర్తులు కష్టాల్నించి చావుకి వేసిన దారిలాగ, వికృతంగా, అందంగా, భయం కరంగా, సున్నితంగా ఆమె కళ్లనించి జారి, బుగ్గలమీదుగా పాకి, మెడమీదుగా బాగా చిరిగిన జాకెట్టు నోదార్చి, అక్కడే సొమ్మ సిల్లేయి—కాస్సేపు గడిచేక ఆ అమ్మాయికి తెలివొచ్చింది. తెలివితోబాటు, గాభరా, భయం వచ్చేయి. మళ్లీ అనుకోకుండా కన్నీళ్లొచ్చేయి. ఇంకిపోయిన చెరువులోకి ఓ పెద్ద బండరాయేస్తే ఆఖరికి మిగిలిపోయిన కాస్తంత నీరూ పైకి తుళ్లినట్టు, ఆమెలో మిగిలిన కాస్త కన్నీరు బైటికొచ్చేసింది. వాటితోనే కళ్లలో ఎర్రని ఎరుపొచ్చింది. ఎక్కిళ్లొచ్చేయి....మళ్లీ....ఇందాక దరమాసుపత్రి డాక్టరుబాబు చెప్పింది జ్ఞాపక మొచ్చింది. అందువల్ల మళ్లీ గుండెల్లో బరువు, గుండెచుట్టూ భయం, నాటుకొని, ఎదిగి, ఒక్క సారిగా పొంగేయి.

ఇందాక తనేటి సేసింది? దరమాసు పత్రికి తల్లి(ని)చ్చా మీద లాక్కెళ్లింది. దాన్నొరండాలో వొడేసి, తనెల్లి డాక్టరుబాబు కాళ్లమీద పడింది. పడి,

"డాక్టరుబాబూ! నాతల్లి.... అది బైట కూలబడిపోనాది. దానికి మీరు పేనం పొయ్యాల. మీ కాళ్లట్టుకుంటాను" అంది.

అప్పుడేటన్నాడ్డాక్టరుబాబు? ఏటన్నాడు?

"అదేదో ఇంజీసనియ్యాల. అద్దైదు రూపాయాద్ది....అదిస్తేనే నీ తల్లి బతుకుద్ది. ఏటి? అర్దమైందా?" అన్నాడు డాక్టరుబాబు తల్లి న్చూసేక.

"మరైతే డాక్టరుబాబూ! ఇంజీస నెప్పుడివ్వాల?" అంది.

"రాత్రి తప్పితే, రేప్పొద్దున్న"

"మరైతే ఎల్లిరానా? నాతల్లిని బతికిస్తావా?"

"ఊఁ! ఊఁ!"

ఆ తర్వాత ఆ పద్దెందేళ్లూ, ఎర్రని కళ్లూ వుండి.......ఆ పద్దెందేళ్లపాటు ఎర్రని కళ్లతో ఎప్పుడూ సాధారణంగా ఏడవక పోవడం లేని ఆ అమ్మాయి—'నాగులు' తల్లిని గుడిసెకి తీసుకొచ్చింది. తీసుకొచ్చి గుడిసంతా వెతికింది. ఇంట్లో కూడేట్నేదు! కానిడబ్బు కూడా లేదు. అమ్మ కారోగ్యం నేదు. గుండెల్లో భయంతప్ప మరేట్నేదు! గుడిసెలో సీకటి గాని ఇంకేట్నేదు.

మరున్నదేటి?

'యెంకటీస్పరుడి బొమ్మ."

"ఐతే ఐదు రూపాయలు? ఔనౌనదే కదూ! అదేకదూ! అదే!"

అప్పుణ్నాగులు తల్లిని మంచం మీద పడకోబెట్టి రిచ్చా యెంకణ్ణి 'డబ్బుల్తరువా తిస్తా' నన్చెప్పి పంపించేసి గుడిసెలో ఆ 'యెంకడి' బొమ్మకాడకెళ్లి, చేతుల్జోడించి "బగంతుడా! ఇదేట్నాకీ పరీచ్చ? అది.... మాయమ్మ.... ఒట్టెర్రిబాగుల్ది. అత్తొచ్చి నన్నాళ్లూ నాకూడెట్టింది. వున్నంతలో సీరలు కొంది. బైస్కోపుల్చూపిచ్చినాది. నన్ను పేనంగా చూసిన్ది. కాని, ఇప్పుడది డౌనైపోన్ది. దానికి జబ్బుచేసిన్ది...నీకు

తెలుసు గందా? సెట్టిగారింట్లోనూ, పంతులు గారి మేళ్లోనూ, రెడ్డిగారి బొవంతిలోనూ, ఇంకా మిగతా ఇళ్లల్లోనూ నేనే యెల్లి పన్జేస్తున్నాను. ఐతే...నాకేవీ బాదనేదు. కాని... మాయమ్మ, అదిప్పుడైదు రూపాయల్నేక పోతే సచ్చిపోద్ది. అంచేత ఆ ఐదురూపాయలూ నాను తేవాల ?! అది సస్తే నాను బతకలేను. అంచేత ఆ డబ్బు దొరికేట్టు చెయ్యి బగంతుడా! మా బీదపేనాల్ని రచ్చించు." అని చాలా దీనంగానూ, జాలిగానూ ప్రార్థించింది నాగులు. అలా ప్రార్థించేక ఆమె ముందుగా పంతులుగారింటికి పరిగెత్తింది.

పంతులుగారిల్లు నాగులింటికి మరీ దూరం కాదు. అంచేతామె చాలా జోరుగా పరిగెత్తి చాలా కొద్దిసేపట్లో పంతులుగారిల్లు చేరింది. "పంతులు బాబుగోరూ" అని గట్టిగా వొగరుస్తూ రెండుమార్లు పిలిచింది. పంతులుగారు పలకలేదు.

"ఏంవే" అంటూ పంతులమ్మగారు బైటికొచ్చేరు. వచ్చి నాగుల్ని చూసి "నువ్వటే" అని ఆశ్చర్యపోయేరు. బాగా డబ్బున్న కటుంబాల్లో ఆవిడ దొకటవడంవల్ల ఆవిడకి నాగుల్లాంటి మనుషులంటే చాలా అసహ్యం, నిర్లక్ష్యవూను. అందువల్ల ఆవిడ ఆశ్చర్యపోవడమవగానే, "ఏవిఁటా అరుపులు? ముద నష్టపుమ్మండా! ఇవాళ్లంతా ఏవఁయ్యేవ్? అంట్లెవరు తోవుతారే? నీ తాతా? మీ అమ్మ చూస్తే జ్వరవఁన్చెప్పి (దొంగముండ) ఇంట్లో పడుందీ! నువ్వు చూస్తే ఇలా ఎగ్గొట్టేస్తావూ! ఏవిఁట్రా దొంగముండల్లారా, మీ వుద్దేశాలు? నెలా అయేసరికి మాత్రం ఐదు కరుకులు— ఒకటీ రెండూ కాదు; ఐదు కరుకుల్లాంటి రూపాయలు మాత్రం చేతిలో పొయ్యాలీ? ఏవిఁటీ ఇలా ఐతే వెంటనే వెళ్లిపో. మళ్లీ కనిపించకు. ఆఁ! చనువిస్తే నెత్తికెక్కుతారే మీరు. పద! అంట్లు తోవుఁ! పొద్దుట్నించీ తుడవని గదులన్నీ తుడూ!" అని చాలా కోపంగా అని, ఇంకా కోపంగా "హుఁ" అని హుంకరించిందావిడ. అప్పుడావిడ కళ్లు పొడుగ్గానూ, వెడల్పుగానూ కూడా సాగేయి. అలసట వల్ల కలిగిన చెవఁట వల్ల ఆవిడ నుదుటి మీది పావలా కాసంత కుంకంబొట్టు కదిలి, చెదిరి అర్ధరూపాయంతైంది.....ఆవిడక్కోపం వస్తే, మాత్రం మనిషికాదు (తమాషాలా? మరేంటీ?) ఆవిడ కోపపుహోరులో ఏవైనా చెయ్యగల్దు. కోపంగా లేనప్పుడావిడ మొగుణ్ణి చిటికిన వేల్తో ఆడించగలదు. కోపంవస్తే, ఆవిణ్ణి చూస్తే చాలు, ఆయనే ఆడతాడు.

ఈ గోలంతా విని— సింహంగారు పంచాయతీ చేస్తూ లేడిని కోప్పడుతున్నపుడు, ఆ కేకలు విని నిద్దర్లేచి గబగబా వొళ్లు విరుచుకుని బైటికొచ్చిన అసిస్టెంటు నక్కలాగ—పంతులుగారైన పంతులమ్మ భర్తగారు ఆవలిస్తూ బైటికొచ్చేరు. భార్య స్వరూపం చూడగానే ఆయనకి ఆవలింతా, నవనాళ్లూ ఆగిపోయేయి. ఐనా ఎదురుగా మరో అడదుండడం వల్ల ఆయన భయాన్ని కాస్త కంట్రోల్ చేసికొని, నక్క సింహాన్ని అడిగినట్టే, వినయాతివినయంగా "ఏం సింహాలూ! ఏవైంది" అనడిగేరు.

అప్పుడు 'సింహాద్రమ్మ' అనబడే పంతులమ్మ గారు పంతులుగారి పక్క తిరిగి, "ఏవైందా?" అనడిగేరు. అలా అన్నప్పుడావిడ కంఠంలో కోపాన్నీ, వెటకారాన్నీ 'గమ్మత్తుగా 'మిక్స్' చేసేరు. ఆ తరువాత నడుంకి రెండువైపులా చేతులుంచుకుని ఏవైందో చెప్పేరు. చెప్పి "చూసేరా దొంగముండ" అన్నారు.

"చూసేను" అని పంతులుగారు చిన్నగా నవ్వేరు.

"హుఁ" అని పంతులమ్మగారు మళ్లీ హుంకరించేరు.

ఆ తరువాత ఓ రెండు సెకెండ్లు పంతులమ్మ గారూపిరి తీసుకున్నారు. ఆ వ్యవధి లోనే నాగులు తేరుకొని, చెప్పగలిగినంతలో వాళ్ళమ్మ పరిస్థితి చెప్పి, "ఐదు రూపాయ లండమ్మగోరూ! మీ కాళ్లట్టుకుంటాను. సచ్చి మీ కడుపున పుడతాను. ఆ సూదిమందితే కాని మాయమ్మ బతకదట. దాని పేనం దక్కించండమ్మా" అని చాలా దీనంగా వేడు కుంది నాగులు. అలా అంటున్నప్పుడామె, కళ్లలో నీళ్లు నిండేయి. మనసులో భయం, ఆతృత కలిసి పొంగేయి. అలా అన్నాక ఆమె అక్కడే పంతులమ్మగారి పాదాల దగ్గిర కూల బడింది.

అప్పుడు పంతులమ్మగారికి 'దరిద్ర ముండ' 'వెధవ్వేషాలు' మితిమీరుతున్నందుకు చాలా కోపం వచ్చింది. అందువల్లావిడ దూరంగా జరిగి, పంతులుగారితో "చూసేరా? దొంగ వెధవ్వేషాలు....పన్జేయడం మానీడవే కాదుట! ఐదు రూపాయలివ్వాల్ట! ఆఁ!" అన్నారు. అందుకు జవాబుగా పంతులుగారు "ఆఁ! ఆఁ! ఆఁ!"అని—మృగరాజు "నేన్తప్ప మిగతా జంతువు లన్నీ దద్దమ్మలు" అన్న స్టేట్‌మెంట్‌కి నక్క తలూపినట్టూపేరు. తలడ్డంగా తిప్పడం ఆయన (వైవాహిక) జీవితంలో లేనేలేదు....

ఆవిడ చిరుతపులైతే ఈయన పులి దగ్గరసిస్టెంటు పిల్లి. ఆవిడ డైనమేటైతే ఈయన ఎప్పుడూ డైనమేటువల్ల ఎగిరి పోయే పక్కనుండే రాతిముక్క.

మరి కాస్సేపేడ్చి, అవసరాన్ని చెప్పినా, నాగులికి తిట్లూ, శాపాలూ, పోయన్నొఖరీ తప్ప మరేం దక్కలేదు. అందువల్ల నాగులు బైటి కొచ్చి సెట్టిగారింటి వేపు పరిగెత్తింది....

పనిలోకి రానందుకు మామూలు తిట్లన్నీ తిన్నాక, మళ్లీ నాగులు మనసునీ, ఆశనీ మామూలు చీకటే ముసిరింది......

సెట్టిగారిల్లు బంగారబ్బోను. ఆయన భార్య చుంచెలక. ఆయనో ఎలక. పంజరం చుట్టూ పకడ్బందీగా దానం, వుపకారం లాటి పురుగులు వాలకుండా కరెంటు.

తిట్లూ, కన్నీళ్లు తప్ప మరేవీ మిగల న్నాగులు బైటికొచ్చి "పంతులుగారే నయం" అనుకుంది.

ఆ తరవాతామెకి కన్నీళ్లు రాలేదు. అమ్మ జ్ఞాపకమొచ్చింది. అమ్మకెలాగుందోనని ఆమె చాలా బెంగ పెట్టుకుంది. కాని ఐదు రూపాయల్లేందే. ఎలాగా?......ఎలాగ? నాగులు మనసంతా మసిపూసి నల్లెంది. తప్పదు. ఎల్లాలి... "అందరి పాదాలు పట్టాల మరి". నేకుంటే...అమ్మ...ఐదు రూపాయలు...

* * *

రెడ్డి మంచివాడు కాదు. కాని విపరీతంగా డబ్బున్నవాడు. అందువల్ల అతను కాస్త నిక్కచ్చిగా వుండే మనిషి, కాని మంచి వాడు. "కాకపోవడమేవిటి సార్?"

నిఖార్సయిన విషాన్నెండ బెట్టి, దానికి పాలిష్ కొటి, హిట్లర్ మీసాలు తగిలించి, నూరో నెంబరు నూలుపంచె, ఖద్దర్లాల్చీ వేసి, చేతికి ఓ కర్ర ఇస్తే—అది రెడ్డౌతుంది.

అతని కళ్లు రెండూ, నిప్పు దగ్గిర రెండు మిణుగురుల్లా మెరుస్తాయి. అతన్నోరు అతి అందమైన కాలనాగు చిన్నగా చుట్టు కున్నట్టుంటుంది. అతను మాటిమాటికీ ఆ పెదవుల్ని నాలికతో తడుపుతూండడంవల్ల, ఆ నాలిక పాము 'నాలిక' లాగే వుంటుంది. ఐనా అతని పెదవులు చాలా గంభీరంగా, ముడు

చుకుపోయి కలుసుకున్న రెండు జెర్రిపోతుల్లా వుంటాయి. అతను మాట్లాడుతూంటే—ఓ నాగు పామూ, రెండు జెర్రిపోతులూ పూన పక్క చూసి బుసకొట్టినట్టుంటుంది.

అతని చూపులు చాలా భీకరంగా—యమలోకంలో పాపుల్ని నిప్పుల్లోకి తోస్తున్న యమదూత కళ్ళు ఆ మంటల్లో మెరిసినట్టు, అతి ఎర్రగానూ, అతి భయంకరంగానూ, మెరుస్తాయి. (ఆస్కాలుకాదు. రెడ్డిగార్కి పెర్మిట్టుంది.) అతని చూపులు మొదట కళ్ళని ఛేదించి: ఆ తర్వాత మెదణ్ణి ఛేదించి, ఒక్కసారి కపాలాన్ని బద్దలుగొట్టి బైటికి జారిపోయి నట్టుంటాయి. అందువల్ల అవి—పెనుపాము, దెబ్బతిన్న పులి.

దేవుడితోదెబ్బలాడి కేయాస్‌లోకి జారి పోయిన శాటన్, కొడుకు మరణ వార్త విని, మళ్ళీ రాముణ్ణి తల్చుకున్న రావణాసురుడు, తన మేనల్లుడింకా బతికే వున్నాడని అప్పుడే తెలిసిన కంసుడు, వీటన్నిటి, వీళ్ళందరి కళ్ళనీ ముద్దగా కలిపి, సరాసరి కట్టి, తీసిన భాగంలో ఇంత విషం పోసి తగిలించినట్టు, అవి అతి భయంకరమైన పెనుభూతపు కళ్ళలా వుంటాయిగాని, మనిషి కళ్ళలా వుండనే వుండవ్.

రెడ్డి బ్రహ్మచారి కాదు. అతనికి నలుగురో, ఎందరో పెళ్ళాలు అఫీషియల్‌గానూ, ఇంకొందరు అనఫీషియల్‌గానూ, (అందరివీ వేరు వేరిళ్ళే! రెడ్డిగారేవీ దానకర్ణుల్సార్?) వున్నారు. రెడ్డికి వీళ్ళేకాక, బోల్డు బేంకె కౌంటూ, తాతల్నాటి ఖ్యాతి, బోలెడంత, బంగారం (గోల్డ్ బాండ్స్ కివ్వన్ది) కూడా వున్నాయి. అంచేతతనికి సాధారణంగా కోపం రాదు. అతని పెదవు లెప్పుడైనా ఖాళీగా వుంటే అవి నవ్వుతూనే వుంటాయి కాని, కోపంగా వుండవ్.

కాని.....రెడ్డిగా రీవేళ చాలా కోపంగా వున్నారు. అర్నెల్లకి ఐదువేలిచ్చి కొనుక్కున్న 'చంద్రవదన'తో ఆయన్చాలా కోపంగా మాట్లాడుతున్నారు.

ముందు ర్రాత్రాయనా, చంద్రవదనా కలిసి, అంతందమైన డిన్నర్ తిన్నారా! పని మనిషిముండ చూస్తే రాలేదు. మరీ బిర్యానీ ప్లేట్లు, విస్కీగ్లాసులూ, ఇవన్నీ, "ఎవరు, కడుగుతారు? హూ ది హెల్ విల్ వాష్? ఆ పని మనిషి రానీ! రాటెన్ బిచ్". అని కోపంగా విసుక్కున్నాడు రెడ్డి.

సరిగ్గా అదే సమయానికి "బాబూ గోరూ" అన్న నీరసమైన కేక రెడ్డికి విన బళ్ళేదుగాని 'చంద్రవదన'కి వినబడింది. అప్పు డావిడ "యువర్ రాటెన్ బిచ్ హెజ్ కమ్—ఇట్ సీమ్స్" అంది. అని నవ్వింది.

రెడ్డి నవ్వలేదు. "ఏదీ? ఎక్కడ" అంటూ చేతిలో సిగార్ నేలకేసి కొట్టి గబగబా వరండాలోకి నడిచేడు. అక్కడ నాగుల్ని చూడ గానే అప్పుడే కొట్టిన సోడాలాగ అతను పొంగేడు. నాగుల్ని బూతుల్తిట్టి "ఏంవే? ఎక్కడ చచ్చేవే?" అని చాలా కోపంగా గద్దించడిగేడతను.

అప్పుణ్నాగులేవీ మాటాళ్ళేదు. వరండా మీద కూర్చుండిపోయింది. అప్పటికామె చాలా ఇళు తిరిగింది. చాలా కన్నీళ్ళు కార్చింది. చాలాసార్లు దేవుడి మీద విసుక్కుంది. చాలా సార్లు నిట్టూర్చింది. చాలాసార్లు అమ్మ గురించి భయపడింది. చాలాసార్లు మళ్ళీ దేవుణ్ణి తలుచుకొని ధైర్యం తెచ్చుకుంది. అందువల్లామె చాలా అలిసిపోయింది. చాలా

దీనంగా రెడ్డిగారి 'బొవంతి' వరండా మీద వాలిపోయింది.

అప్పుడు రెడ్డి సడన్‌గా గాస్ తగ్గిన సోడాబుడ్డిలా తగ్గిపోయేడు. అక్కడక్కడ చిరిగిన నాగులు జాకెట్టు వేపాకలిగా చూసేడు. ఓ ఐదారు సెకండ్లలా చూసి,

"ఏం నాగులూ! పొద్దున్నెందుకు రాలేదు? మీ అమ్మకెలాగుంది?" అని వీలైనంత సున్నితంగా అడిగేడు.

అప్పుణ్ణాగులు చాలా ఆశ్చర్యంగా తలెత్తింది. అడవిలో వొంటరిగా వున్నప్పుడు మీదకి పులి కోరలు తెరుచుకుని వస్తున్నప్పుడు, బతుకుమీదాశొదిలేసి, కళ్ళు మూస్కొని, చావు కోసం, అతిభయంగా, అతి ఘోరంగా, అతిదీనంగా చేతులూ, మనసూ చాచినప్పుడు—ఒక్కసారి, ఒక్కసారిగా—మన వలాగే వుండిపోతే, కళ్ళు తెరిచ్చూస్తే, మన చేతి మీదో, బుగ్గమీదో ఆ పులి, మన పెంపుడు కుక్కలా, సున్నితంగా, మెత్తగా విశ్వాసంగా నాకినప్పుడు, మన కాశ్చర్యం కలిగినట్టు, రెడ్డి ప్రవర్తన చూసి నాగులికి చాలా ఆశ్చర్యం వేసింది. అప్పుడామె చాలా ఆత్రుతగానూ, ఆశగానూ రెడ్డితో పరిస్థితంతా చెప్పింది. చెప్పి, "రెడ్డి బాబూ! నీ కాళ్లట్టుకుంటాన్తండీ! నాయమ్మని కాపాడు బాబూ!" అని కన్నీళ్లతో అని కాళ్లు పట్టుకోబోయింది.

రెడ్డి వెనక్కి జరిగిపోయేడు. చిన్నగా నవ్వి, "ఈపాటి దానికి కాళ్లు పట్టుకోవాలా నాగులూ? ఐదు రూపాయలేం ఖర్మ? ఐదొందలిస్తాను." అన్నాడు.

గొప్పవాళ్లలో కొందరికి ఎలాటప్పుడెలాటి కోరికలు పుడతాయో చెప్పడం కష్టం. మూడైదులు సిగరెట్టు కాల్చే ఆయనకి, సడన్‌గా మూడుగుర్రాల బీడీ కాల్చాలనిపించొచ్చు. షాంపేన్ రోజా తాగే ఆయనకి, సారాతో కుంకుడుకాయ పులుసు కలిపి తాగాలనిపించొచ్చు.

అలాగే అంతటి రెడ్డికి సడన్‌గా, నాగుల్నీ ఆమె చిరిగిన జాకెట్టునీ చూసి, చాలా వింతైన కోరిక్కలిగింది. ఒక్కరాత్రికి సైయ్యంటే "ఐదొందల్నీవే!" అన్చెప్పి శీవిగా సిగార్ ముట్టించేడతను.

నాగులికొక్కంచెం సేపయాక రెడ్డేవన్నాడో అర్థమైంది. ఒక్కసారిగా ఆమె మీదికి పాములెన్నో దూకినట్టు, అవి కోరల్తో గుండెల్ని పీకేసినట్టూ, ఒక్కసారి ఎన్నో మంటలు చుట్టు ముడితే, వాటి సెగల్లో మనసు కాలిపోతున్నట్టూ ఆమెకు అనిపించింది.

వెంటనే మొహాన్ని వీలైనంత భయంగా పెట్టి, చిరుతన్చూసిన చిరుతొండలాగ—అక్కణ్ణుంచి తడబడుతూ, పరిగెడుతూ వచ్చేసింది.

అలా రోడ్డు మీదికొచ్చేసిన్నాగులు వొగరుస్తూ ఓ చోటాగిపోయింది. అప్పుడామె చుట్టూ మ్యునిసిపల్ వెలుగుంది. ఆమెకెదురుగా సగం తలుపులు మూసిన మందులాష్షుంది. అప్పుడామె కంగారుగా ఆ షాపు దగ్గరికెళ్లి "బాబూ! దుకానం మూసేస్తర్నా?" అనడిగింది.

ఆ షాపాయన, "లేదు లేదు! వుంటుందిలే! వేగిరం రా!" అన్నాడు. అప్పుణ్ణాగులి కేమనిపించిందంటే, "అమ్మ 'పేనం' కోసం—అందువల్ల మందుకోసం చాలావేగం ప్రయత్నించాలి." అనిపించింది.

కాని....వొంట్లో నీరసం తప్ప వోపిక లేదు. నిరాశ తప్ప, ఆశే లేదు. కంట్లో